క్లుప్తంగా

మద్యం అక్రమ విక్రయాలు సాగిస్తే చర్యలు



కలిగిరి: గ్రామాల్లో మద్యం అక్రమంగా విక్రయాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కలిగిరిలోని సెబ్ పోలీస్ స్టేషన్‌ను ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌గా సోమవారం మార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల పరిధిలో నాటుసారా, మద్యం అక్రమంగా అమ్మకాలు జరుపుతుంటే 94409 02523 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఇటుకబట్టీల పొగతో వాహనచోదకుల అవస్థ



అల్లూరు: మండలంలోని బీరంగుంట వద్ద రోడ్డు పక్కనే ఇటుకబట్టీలను నిర్వహిస్తున్నారు. ఈ బట్టీల నుంచి వెలువడుతున్న పొగ రోడ్డును దట్టంగా కమ్మేస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. మరోవైపు ప్రయాణికులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ఇటుక బట్టీలను రోడ్లకు దూరంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వరాహాలకు అతిథిగృహం



కావలి: పట్టణంలోని విద్యుత్ శాఖ అతిథిగృహం కాస్తా వరాహాలకు అతిథి గృహంగా మారింది. గతంలో ఉదయగిరిరోడ్డులో విద్యుత్ శాఖ అతిథిగృహాన్ని నిర్మించింది. దాని ఆలనా పాలనను ఆ శాఖ అధికారులు విస్మరించడంతో అది కాస్తా శిథిలావస్థకు చేరి పందులకు నెలవుగా మారింది. అతిథి గృహ ప్రాంగణంలో పిచ్చిచెట్లు పెరిగిపోవడంతో విషసర్పాలు పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయి. ఈ అతిథిగృహం ఉన్న ప్రదేశం ఎంతో ప్రాధాన్యం కలిగినది అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అల్లుకున్న నిర్లక్ష్యం



ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకుపోయాయి. వాటిని కిందనే తొలగించాల్సిన లైన్‌మెన్ నిర్లక్ష్యం వహించడంతో పై వరకు ఎగబాకాయి. మరికొద్దిరోజుల్లోనే హైవేను దాటిపోయే ప్రమాదం ఉంది. స్తంభం చుట్టూ నివాసాలు ఉన్నందున ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు డీ వార్మింగ్ డే

వరుకుంటపాడు : మండలంలో మంగళవారం డీ వార్మింగ్ డేను నిర్వహించనున్నట్లు వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు కరిష్మా, ఆయేషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారుల్లో నులిపురుగులతో రక్తహీనత తలెత్తుతుందన్నారు. చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగించనున్నట్లు చెప్పారు. మండలంలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 3,200 మందిని గుర్తించామని, వారందరికీ మధ్యాహ్న భోజనం తరువాత వైద్యారోగ్య సిబ్బంది ఆల్బెండాజోల్ మాత్రలు అందజేయనున్నట్లు వివరించారు.

ఉదయగిరి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 9,216 మంది ఉన్నారని, వారందరికీ మధ్యాహ్న భోజనం తరువాత వైద్యారోగ్య సిబ్బంది మాత్రలు అందజేస్తారని చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

- యథేచ్ఛగా రాత్రి వేళల్లో మట్టి అక్రమ తరలింపు
- చెరువులు, కాలువ కట్టలను కొల్లగొడుతున్న టీడీపీ నాయకులు
- ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- మట్టి ట్రాక్టర్ల వేగంతో హడలిపోతున్న గ్రామీణులు



సదరన్ చానల్ కట్ట మట్టిని జేసీబీ సాయంతో అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సంగం: అధికార మదం తలకెక్కించుకున్న కొందరు టీడీపీ నాయకులు మట్టి మాఫియాగా మారారు. చెరువులు, కాలువల కట్టల మట్టిని రాత్రి వేళల్లో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి ట్రాక్టర్లు వేగంగా వెళ్లే క్రమంగా ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. మరోవైపు గ్రామాలు దుమ్ముతో నిండిపోతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంగం మండలం ర్యాంపు సమీపంలోని పడమటిపాళెం పంచాయతీ పరిధిలోని, పల్లిపాళెం, వంగల్లు పరిసర ప్రాంతాల నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొందరు టీడీపీ నాయకులు పల్లిపాళెంలోని సదన్‌చానల్ కట్టలతో పాటు వంగల్లు చెరువులోని మట్టిని లేఅవుట్లు, ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

టీడీపీ నాయకులు మాఫీయాగా మారి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లగా వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళల్లో మట్టి అక్రమ తరలింపును ప్రజలు అడ్డుకుని నిరసన తెలియజేస్తుండడంతో మట్టి మాఫియా కూర్చుని రాత్రి వేళల్లోనే తరలించాలని ప్రణాళికను సిద్ధం చేసుకుంది. రాత్రి 7 గంటల నుంచి వేకువజామున 5 గంటల వరకు వందలాది వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు.

ఆందోళనలో గ్రామీణులు

రాత్రి సమయాల్లో మట్టి తరలింపు వాహనాలు అత్యంత వేగంతో వెళ్తున్నాయి. ఆ సమయంలో పొలాల్లోకి నీరు పెట్టేందుకు వెళ్లే రైతులు వాహనాల వేగానికి భయపడిపోతున్నారు. గ్రామాల్లోనూ వేగంగా వెళ్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. మరోవైపు వాహనాలు రేపుతున్న దుమ్ముతో తమ ఇళ్లు మట్టి కొట్టుకుపోతున్నాయని గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మట్టి మాఫియా నేతలకు, వాహనదారులను ప్రశ్నిస్తే తమది అధికార పార్టీ అని బెదిరిస్తున్నారని గ్రామీణులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని గ్రామీణులు కోరుతున్నారు.



రాత్రి వేళ మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

డీజే సౌండ్ తగ్గించమన్నందుకు..

- మహిళలపై దాడి
- 9 మంది యువకులపై కేసు నమోదు



గాయపడిన మహిళ

సంగం: వినాయక చవితి నిమజ్జనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే శబ్దాన్ని తగ్గించమన్నందుకు ఇద్దరు మహిళలపై యువకులు దాడికి పాల్పడిన ఘటన సంగంలోని శివాజీ సెంటర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు 9 మంది యువకులపై సంగం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. సంగం తూర్పువీధిలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుడ్ని ఆదివారం రాత్రి నిమజ్జనానికి తరలించే క్రమంలో డీజేను ఏర్పాటు చేశారు. ఉత్సవం శివాజీ సెంటర్ వద్దకు చేరుకున్న సమయంలో ప్రియాంక, కిన్నెర అనే మహిళలు కొద్దిగా డీజే శబ్దాన్ని తగ్గించాలని కోరారు. దీంతో యువత, మహిళల మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో తమపై 9 మంది యువకులు దాడి చేశారని ఇద్దరు మహిళలు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురువులు సమాజ నిర్దేశకులు



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సత్కరిస్తున్న అపస్మా నేతలు



ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

వింజమూరు(ఉదయగిరి): గురువులు సమాజ నిర్దేశకులని, ఉత్తమ సమాజ స్థాపనలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఉదయగిరి నియోజర్గంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని వింజమూరులోని ఎస్వీ కల్యాణ మండపంలో అపస్మా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పిల్లలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రాథమిక దశలోనే పిల్లలు సక్రమ మార్గంలో నడిచేలా బోధనలు చేయాలన్నారు. కొందరు విద్యార్థులు చెడుప్రవర్తనతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ సమావేశంలో ఆపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ రమణారెడ్డి, సీవి వెంకటనారాయణ, యూనియన్ నేతలు నేతాజీ రత్నం, గోపాల్ రెడ్డి, ఉదయశంకర్, శ్రీనివాసులు, కృష్ణారావు, నూతలపాటి మహేశ్వరరావు, వాసు, అంకిరెడ్డి, ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష తగదు

ఆత్మకూరు: దళితులపై వివక్ష చూపడం సరికాదని ఆత్మకూరుకు చెందిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శేషం సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. ఆదివారం రాత్రి మర్రిపాడు మండలం పొంగూరులో దళితులకు చెందిన గణేశ్ విగ్రహాన్ని గ్రామంలోకి రానీయకుండా కొందరు అడ్డుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని మర్రిపాడు మండల తహసీల్దార్, ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో గ్రామంలో పౌర హక్కుల గ్రామసభ నిర్వహించి వివక్షలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఏదిఏమైనా ఇలా వివక్ష చూపడం బాధాకరమని, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఆత్మకూరు: ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్సై షేక్ జిలానీ సోమవారం పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపడుతున్న క్రమంలో వాశిలి వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎం సునన్న

కలిగిరి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తాయని కుడుములదిన్నెపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎం సునన్న తెలిపారు. కుడుములదిన్నెపాడు పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాజన సభలో ఆమె మాట్లాడారు. పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వింజమూరు కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ రామనారాయణ మాట్లాడుతూ సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తున్నామని తెలిపారు. సొసైటీ సభ్యులు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలన్నారు. అందుకోసం ఆధార్‌కార్డు, పొలం పట్టాదారు పాస్తుపుస్తకం, బ్యాంక్ ఖాతా జెరాక్స్, నామిని వివరాలు, వారి ఆధార్ కార్డు జెరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను పీఏసీఎస్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. కేవైసీ చేసుకున్న సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందన్నారు. సొసైటీ ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు అందజేస్తున్నామన్నారు. పీఏసీఎస్ సీఈఓ ఖాజామస్తాన్, అసిస్టెంట్ మేనేజర్ సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రూ.2.15 కోట్లతో గ్రామకొలను పనులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి: మండలంలో సాగు, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరిలోని పెద్దచెరువుకు సంబంధించి ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.2.15 కోట్లతో మంజూరైన గ్రామ కొలను పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. సోమశిల ఉత్తర కాలువ జలాలను చెరువులకు తీసుకొస్తేనే మండలంలోని తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని, ఆ దిశగా కృషి చేస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు బీవీ రామారావు, చీమల తాతయ్య, పూసాల వెంగపనాయుడు, సీహెచ్ సుబ్బారెడ్డి, కాకు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట బస్‌షెల్టర్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మున్సిపల్ అధికారులకు సమాచారం అందజేశారు. మృతుడు సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగి ఉండి బ్లూ గళ్ల లుంగీ, వెడల్పు గీతల చొక్కా ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మున్సిపల్, పోలీసు అధికారులు పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని అధికారులు కోరారు.

బంతి సాగుపై రైతుల ఆసక్తి



తీరంలో సాగుచేసిన బంతి చెట్లు

కావలి: మండలంలోని తీరప్రాంత ఇసుక నేలల్లో విస్తారంగా బంతి సాగు చేపడుతున్నారు. బంతి సాగుకు తక్కువ పెట్టుబడులు అవుతుండడం..తక్కువ సమయంలో పూల దిగుబడి వస్తుండడంతో రైతులు బంతి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అక్టోబరు నుంచి జనవరి వరకు పండగలు సీజన్. ఈ సమయంలో బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు బంతి సాగుచేపడుతున్నారు. బంతి మొక్కలను నాటిన తరువాత ముప్పై రోజులకే పూల దిగుబడి ప్రారంభమవుతుంది. నీటి ఎద్దడి ఉన్నా డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకోవడం వల్ల మొక్కలు బాగా ఎదిగి దిగుబడులు ఆశాజనకం ఉంటున్నాయి. సాగుకు స్వల్ప పెట్టుబడులు అవుతుండడం వల్ల లాభాలు వస్తుండడంతో బంతిపూల సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

పారా గడ్డితో పాల సిరులు



అన్నగారిపాలెంలో సాగుచేసిన పారా గడ్డి

కావలి: నియోజకవర్గంలోని పాడి రైతులు పశుగ్రాసాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పచ్చిమేత రుచికరంగా ఉండడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయి. సులభంగా జీర్ణం చేసుకుంటాయి. మంచి పోషకాలు ఉండడం వల్ల పాల దిగుబడులు 25శాతం మేర పెరుగుతాయి. పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుంది. దాణా ఖర్చులు తగ్గుతాయి. పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనల మేరకు కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లోని పాడిరైతులు పశువుల అవసరాన్ని బట్టి నేల స్వభావానికి అనువుగా ఉండే పారా గడ్డి జాతిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ గడ్డిని కేవలం వేర్లు, కాండం ద్వారానే సాగు చేసుకునే వెసులుబాటు ఉంది. విత్తన సమస్య కూడా లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఖాళీ భూముల్లో పాడి రైతులు ఈ గడ్డిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ గడ్డి ఏడాది పొడవునా అందుబాటులో ఉంటుంది. నీరు ఎక్కువ, తక్కువ ఉన్న నేలల్లోనూ ఏపుగా పెరుగుతుంది. పోషక విలువలు గణనీయంగా ఉంటాయి. మాంసంకృతులు 8 శాతం మేర ఉంటాయి. పిండి పదార్థాలు 60 శాతం లభ్యమవుతాయి. ఏడాదికి ఎకరాకు 200 టన్నుల వరకు పశుగ్రాసం నిరాటంకంగా అందుతుంది. దీంతో రైతులు పారా గడ్డిని అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో సాగు చేసి పాల సిరులు పొందుతున్నారు.

ఇష్టంగా తింటాయి



మాకు ఆరు పాడి పశువులు ఉన్నాయి. వాటికి పచ్చి మేతగా పారా గడ్డిని ఎకరా పొలంలో సాగు చేస్తున్నాం. స్ప్రింకర్ల ద్వారా కొద్ది నీటిని అందిస్తే చాటు గడ్డి బాగా పెరుగుతుంది. ఈ గడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. పాడి పశువులు పాలు బాగా ఇస్తాయి.

–లావణ్య, అన్నగారిపాళెం

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



ఏఎస్‌పేటలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



చేజర్లలోని మసీదులో అన్నదానం



ఉదయగిరి: మిలాద్-ఉన్-నబీ సందేశం ఇస్తున్న మతపెద్దలు

ఆత్మకూరు: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని పడమరవీధిలోని పెద్ద మసీదుతో పాటు తూర్పు వీధి, టెక్కే, ఎల్ఆర్‌పల్లిలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త సూక్తులను వివరించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, మహిమలూరు, బోయలచిరివెళ్ల, అశ్వనీపురం, దేపూరు, బొటికర్లపాడు, అప్పారావుపాళెం, వాశిలి, తదితర గ్రామాల్లోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శాంతి సామరస్యాలను కాంక్షిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

అనుమసముద్రంపేట: మండలంలోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఏఎస్‌పేటలో హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా కొండబురుజుల వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మిలాద్-ఉన్-నబీ సందేశాన్ని వినిపించారు.

సోమశిల: అనంతసాగరంలో మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. పఠాన్‌ఖాదర్‌బాషా, షేక్ ఖలీల్, షేక్ ఇబ్రహీం, మహబూబ్‌బాషా, సర్దార్, హాజీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు

చేజర్ల: మండలంలోని ముస్లింలు మిలాద్ -ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. చేజర్లలోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ సాహెబ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టణంలోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని చిన్న, పెద్ద మసీదులతో పాటు ఆస్థాన ఏ ఖాదరియా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ సందేశాన్ని వినిపించారు. ప్రవక్త బోధనలను ప్రతిఒక్కరూ అనుసరించాలని కోరారు. అనంతరం భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



ఆత్మకూరురూరల్: కరటంపాడులో..



ఆత్మకూరులో..

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సాంబశివ ట్రస్ట్ నిర్వాహకులు

ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, 22వ వార్డు పరిధికి చెందిన చెరుకూరి మధు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు యానాది రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, ఏ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.